క్లుప్తంగా

మెగా ఉచిత వైద్యశిబిరం

గుడివాడ టౌన్: రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ వారి ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్ వద్ద గల ప్రభావతి గార్డెన్స్‌లో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య బృందం వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు అఖిల్ తేజ్, కృష్ణంరాజు, కేఎస్ కృష్ణతేజ, క్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.50వేల విరాళం



గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం, స్థానిక శ్రీ గంగానమ్మ ఆలయాల అభివృద్ధి పనులకు రూ.50వేలను దాతలు చాపరాల రాజేష్, మౌనిక దంపతుల కుమార్తె చాపరాల ధృతి అందజేశారు. ఆదివారం ఈ విరాళాన్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, నెహ్రూ పశువుల సంత కమిటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, లయన్స్ మాజీ చైర్మన్ పోలవరపు వెంకట్రావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొప్పురావూరి రవి, మురాల నరేష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



గుడివాడరూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిసరాలను సిబ్బందితో కలసి ఆయన శుభ్రం చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రశాంత వాతావరణంలో ఉద్యోగాలు చేయడం సులభమవుతుందన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గుడివాడరూరల్: పాత గొడవలు నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. గుడివాడ తాలూకా పోలీసుల కథనం మేరకు మండలంలోని దొండపాడుకు చెందిన పి.పాండు అనే వ్యక్తి ఈ నెల 15వ తేదీన రాత్రి తన బొలెరో వాహనంలో చేపలు అమ్ముకునేందుకు విజయవాడ వెళ్తుండగా బిళ్లపాడు సమీపంలోని చిన ఎరుకపాడు వద్ద అంబటి సాయి, ఎండూరి చింటు, మరి కొంత మంది దారి కాచి బీరుసీసాలతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని ఆ ప్రాంత వాసులు గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

పైపులైన్ ఏర్పాటు

మండవల్లి : మండవల్లి మొగలిచెరువు వద్ద ఫిల్టర్‌బెడ్, సంపు, ఓహెచ్ఆర్‌కు నీటిని పంపిణీ చేసే జీఏ పైపులు మరమ్మతులకు సాధ్యపడకపోవడంతో సర్పంచ్ మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో ఆదివారం పైపులైన్ ఏర్పాటు చేశారు. పైపులైన్ ఏర్పాటును సర్పంచ్ ఝాన్సీ, మెండా సురేష్‌బాబు పరిశీలించారు.

మట్టి తవ్వకాలపై ఆగ్రహం



తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెం బీసీ సొసైటీలో బుసక, మట్టి తవ్వకాలపై సొసైటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుసక, మట్టి తవ్విన ప్రదేశాన్ని సొసైటీ సభ్యులు ఆదివారం పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సొసైటీలో తమకు తెలియకుండా శనివారం రాత్రి బుసక, మట్టి తవ్వకాలు నిర్వహించారని సొసైటీ ప్రతినిధి చాగంటిపాటి వెంకట సుబ్బారావు ఆరోపించారు. తవ్వకాలు జరిపిన అక్రమార్కులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సొసైటీ సభ్యులు కోటేశ్వరరావు, సాంబశివరావు, రామలింగం, శివరామకృష్ణ, పి. శివరామయ్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు





లింగవరం గ్రామంలో ఒక పక్కకు ఒరిగి పోయిన విద్యుత్ స్తంభాలు

గుడివాడరూరల్: మండలంలోని లింగవరంలో విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. లింగవరం గ్రామంలో 60 శాతం పైగా విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయి. ఈ సమస్యను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆయా రహదారుల వెంట వృద్ధులు, చిన్నారులు భయం భయంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఒరిగిపోయిన స్తంభాలను, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం



నందివాడ: మండలంలోని ఇలపర్రు గ్రామం వద్ద రోడ్డుపైకి ఒరిగిన విద్యుత్ స్తంభాలు ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

'మీరే సరిచేసుకోండి' అని చెబుతున్నారు



విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి వైర్లు కిందకు వేలాడుతున్నాయని సచివాలయ అధికారుల దృష్టికి తీసుకెళితే 'మీరు ఒక బాదు లాంటిది పాతుకుని స్తంభాన్ని సరిచేసి కట్టుకోండి' అని చెబుతున్నారు. ఇది పద్ధతి కాదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– నాగయ్య, గ్రామస్తుడు లింగవరం

ఎప్పుడు పడిపోతాయోనని భయం



గ్రామంలోని పొలిమేర నుంచి విద్యుత్ స్తంభాలు 60శాతం మేర పూర్తిగా ఒరిగిపోయి వైర్లు కిందకు వేలాడుతున్నాయి. చిన్న గాలి వచ్చినా అవి పూర్తిగా ఇళ్ల మీద పడి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పలుమార్లు సచివాలయంలోని సెక్రటరీ, సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదు. గతంలో ఒకసారి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటి వరకు పరిష్కరించలేదు.

– దొండపాటి పాండురంగారావు, గ్రామస్తుడు లింగవరం

అమరజీవి త్యాగాలను మరువలేం



తోట్లవల్లూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు



మొవ్వలో నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

తోట్లవల్లూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను ఎన్నటికీ మరువలేమని ఆర్యవైశ్య సంఘం జిల్లా ప్రాంతీయ కార్యదర్శి తమ్మన ఉమామహేశ్వరరావు అన్నారు. తోట్లవల్లూరులో పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ ఆలయం వద్ద శ్రీరాములు, గాంధీ విగ్రహాలకు ఉమామహేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్షుడు భవిరిశెట్టి రంగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీ ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ ఉదయ సూర్య సుధాకరరావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త శేష శ్రీనివాసరావు, శివన్నారాయణ, సుబ్బారావు, సందీప్, హరీష్ పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని మొవ్వలోని ప్రధాన కూడలిలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు, వాసవి మాతల చిత్రపటాలకు ఆదివారం పూలమాలవేసి నివాళులర్పించారు. వాసవి క్లబ్ ప్రెసిడెంట్ నంబూరు జగదీష్ కృష్ణ, ట్రెజరర్ పువ్వాడ వరలక్ష్మి, మండల ఆర్యవైశ్య సంఘం సెక్రెటరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్, సుప్రీంకోర్టు న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు అన్నారు. గుడ్లవల్లేరులో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిత్తర్వు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల బూత్ కమిటీల అధ్యక్షుడు బలుసు జితేంద్ర, ఆ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు జి.రవి, నాయకులు మేకల అనిల్, సాయి విజయ రాఘవ, భువనేశ్వర్, నందకుమార్, పవన్ చైతన్య, జావుల్లా, వైశ్య ప్రముఖులు హేమంత్, సాయి, బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో అమరజీవి విగ్రహానికి నివాళులు



గుడివాడలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాము తదితరులు

గుడివాడలో..

గుడివాడ టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక వాసవీ చౌక్‌లో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జి. సునీల్, కల్యాణ మండపం అధ్యక్ష కార్యదర్శులు మోహనరావు, శ్రీరాములు, ఆర్యవైశ్య సంఘం నాయకులు చిన్నా, మురళి, శ్రీనివాస్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షుడు సీతారామస్వామి పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సింగలూరు గ్రామాభివృద్ధి అందరికీ స్ఫూర్తి

గుడ్లవల్లేరు: సింగలూరు గ్రామాభివృద్ధి అందరికీ స్ఫూర్తి అని విజయవాడ దూరదర్శన్‌కు చెందిన ప్రసార భారతి కేంద్ర ప్రాంతీయ వార్తా విభాగాధిపతి, ఉప సంచాలకులు డాక్టర్ జి.కొండలరావు అన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా స్వామి వివేకానంద స్ఫూర్తితో గ్రామాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేయటం ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, సరస్వతి దంపతులకే సాధ్యమైందన్నారు. సింగలూరులో ఆయన ఆదివారం పర్యటించి డాక్టర్ బండారు దత్తత తీసుకున్నాక గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. విస్తరాకుల పరిశ్రమకు చెందిన నూతన కుట్టు మిషన్లను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. తొలుత వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ, జీఈసీ సూపరింటెండెంట్ గద్దె సోమరాజు, ఉప సర్పంచ్ శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లను ప్రారంభిస్తున్న డాక్టర్ కొండలరావు

విదేశీ వ్యామోహంలో యువత

గుడ్లవల్లేరు: యువత విదేశీ వ్యామోహంలో ఉందని విజయవాడ దూరదర్శన్‌కు చెందిన ప్రసార భారతి కేంద్ర ప్రాంతీయ వార్తా విభాగాధిపతి, ఉప సంచాలకులు డాక్టర్ జి.కొండలరావు అన్నారు. మండలంలోని సింగలూరుకు ఆదివారం విచ్చేసిన ఆయన్ను గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో చదువుకున్న వారంతా విదేశాల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. అయితే బాపూజీ పల్లెలే దేశానికి పట్టు కొమ్మలన్న సంకల్పాన్ని ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ నిజం చేశారన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



అడ్డాడ(పామర్రు): మండలంలోని అడ్డాడ గ్రామంలోని క్రీస్తు శిలువ శక్తి చర్చి ఆవరణలో రెడ్డిగారి మదర్ హెల్ప్, హ్యాండ్ సొసైటీ, బేతని చర్చి, ఘంటసాల అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఆ సంస్థల వైస్ ప్రెసిడెంట్ గుంటూరు కృపాసాగర్, సంస్థల ఇన్‌చార్జి వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయ జీర్ణోద్ధరణ పూజలు



గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పూజలను రెండో రోజు ఆదివారం వేద పండితులు కొనసాగించారు. ఈ పూజల్లో గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వీరమ్మ తల్లిది ఘన చరిత్ర

గుడ్లవల్లేరు: మామిడికోళ్ల వీరమ్మ తల్లి అమ్మవారిది 115ఏళ్ల చరిత్ర అని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ స్టేట్ మాజీ కన్వీనర్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది చిత్తర్వు నాగేశ్వరరావు అన్నారు. నూతనంగా నిర్మించిన శ్రీ వీరమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి పునః ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చిత్తర్వు బాలాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన్ను ఆలయ కమిటీ వారు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ వంశ పారంపర్య నిర్వాహకుడు మండా రాంబాబు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు జెట్టి శ్రీరాం, చావా నాగేశ్వరరావు, కూసం హనుమప్రసాద్, తోట ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, నరేంద్ర, మల్లికార్జునరావు, చిత్తర్వు కౌశిక్, చావా సుభాష్ పాల్గొన్నారు.



చిత్తర్వును సన్మానిస్తున్న ఆలయ కమిటీ

కోడిపందేలపై పోలీసుల దాడి

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపిన ఘటన మండలంలోని దేవరపల్లి లంకలో జరిగింది. స్థానిక రాజీగడ్డలంకలో నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్ఐ అవినాశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. 15 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.8,900, 3 కోడిపంజులు, 5 మోటారు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐతెలిపారు.

నాణ్యత చూస్తే నవ్విపోదురు!

గుడివాడ టౌన్: పురపాలక సంఘం పరిధిలో చేపట్టిన డివైడర్ల సుందరీకరణ పనుల్లో నాణ్యత లోపిస్తోంది. నెల రోజుల కిందట ఈ పనులు ప్రారంభించారు. స్థానిక నాగవరప్పాడు వంతెన వద్ద నుంచి బస్టాండ్ ఇన్‌గేట్ వరకు మొత్తం 3.5 కిలోమీటర్లు రంగులు వేసేందుకు రూ. 11 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్లు అధికారులు అంటున్నారు. నాగవరప్పాడు వంతెన వద్ద నుంచి ఈ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం రంగులు వేసే కార్యక్రమం సుమారు 1.5 కిలోమీటర్లు అంటే కొత్త మున్సిపల్ కార్యాలయం వరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు కొనసాగుతుండగానే పనులు ప్రారంభించిన నాగవరప్పాడు వంతెన వద్ద రంగులు వేసిన చోట పెచ్చులు ఊడటం ప్రారంభమైంది. ఇది స్థానికులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పురపాలక సంఘం పనులంటేనే ఇలా ఉంటాయని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.



నాగవరప్పాడు వంతెన వద్ద ఊడిన రంగుల పెచ్చులు (వలయంలో)

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

తోట్లవల్లూరు: పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖాధికారి– 2 సురేష్ తెలిపారు. సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 190 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వల్లూరుపాలెం విద్యార్థులు తోట్లవల్లూరు కేంద్రంలో, దేవరపల్లి విద్యార్థులు పెనమకూరు కేంద్రంలో పరీక్షలకు హాజరవుతారని పేర్కొన్నారు.

గుడ్లవల్లేరులో 505 మంది..

గుడ్లవల్లేరు: మండలంలో సోమవారం నుంచి జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 505 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఎంఈఓ–1 జగన్‌మోహన్‌రావు, ఎంఈఓ–2 గోపాలరావు ఆదివారం తెలిపారు. డోకిపర్రు, కౌతవరం, గుడ్లవల్లేరు, అంగలూరులలోని నాలుగు పరీక్ష కేంద్రాలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు.

కొనసాగుతున్న పుట్టలాంబ బ్రహ్మోత్సవాలు



గుడివాడ టౌన్: నందివాడ మండలం జనార్దనపురంలో వేంచేసియున్న శ్రీ రేణుకా పుట్టలాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు గావించి పుష్పాలంకరణ చేశారు. ఇందులో భాగంగా సామూహిక కుంకుమ పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడికి చెందిన నటరాజ కళాశాల బృందం జానపద నృత్యాలు ప్రదర్శించారు.

ఆటపాక పక్షుల కేంద్రం సందర్శన

మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా హెచ్ఎం సీహెచ్ పిచ్చోడు ఆధ్వర్యంలో ఆటపాక పక్షుల సంరక్షణ కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. విద్యార్థులు వివిధ రకాల పక్షులు, వాటి సంరక్షణ చర్యల గురించి తెలుసుకున్నారు. ఆహ్లాదకరమైన కొల్లేరు మంచినీటి సరస్సు అందాలను వీక్షించారు.



ఆటపాక పక్షుల కేంద్రాన్ని వీక్షించిన విద్యార్థులు

క్రమశిక్షణతో నడుచుకోవాలి

గుడివాడరూరల్: రౌడీషీటర్లు తమ తీరు మార్చుకుని నేరాలకు దూరంగా క్రమ శిక్షణతో జీవించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులు తీరు మార్చుకోకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ చంటిబాబు

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



పామర్రు: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చి మెరుగైన వైద్య సేవలు అందించేలా కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్టు హౌస్‌లో పామర్రు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీహెచ్‌సీలో ఎప్పటికప్పుడు అన్ని రకాల మందులు రోగులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. తొలుత అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఎంపికైన పానుగంటి సాయి సందీప్, అయోధ్య హరిబాబు, కూనపరెడ్డి భవాని, అబ్దుల్ సలీం, జ్యోతిని ఎమ్మెల్యే అభినందించారు. పీహెచ్‌సీ వైద్యశాల కన్వీనర్ డాక్టర్ టీ సూదేష్‌బాబు, వైద్యులు సుధారాణి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



మండవల్లి: కొల్లేటి పెద్దింట్లమ్మ దీవెనలతో కొవ్వాడలంకలో 27 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఎలాటి ఆటంకాలు లేకుండా జరిగినట్లు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని కొవ్వాడలంకలో ఆదివారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.